సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం | 31 | డిసెంబర్ | 2023



దివ్యాంగుల 'వికాసం'
ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన వికాసం పాఠశాలలో నాలుగు రకాల వైకల్యం కలిగిన 142 మందికి విద్యాబోధన చేస్తున్నారు. అంధులకు ప్రత్యేక వసతులు కల్పించారు. 8లో▸



అమాయక గిరిజనులే టార్గెట్
ఇతర రాష్ట్రాల చిరువ్యాపారులు గ్రామీణ ప్రాంతాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. అమాయక గిరిజనులు, ఒంటరి మహిళలు, వృద్ధులను టార్గెట్ చేస్తున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0 /17.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సదరం స్లాట్ బుకింగ్‌కు దివ్యాంగులకు అవకాశం

కైలాస్‌నగర్: దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణపత్రాలు పొందేందుకు మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించినట్లు డీఆర్డీవో ఎస్.కిషన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు తీసుకున్న సర్టిఫికెట్ కాలపరిమితి ముగిసినవారు, కొత్త సర్టిఫికెట్ పొందాలనుకునే జిల్లాలోని దివ్యాంగులు మీ సేవ కేంద్రాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకున్నవారు నిర్ణీత తేదీల్లో రిమ్స్ ఆస్పత్రిలో జరిగే వైకల్య ధ్రువీకరణ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

3న కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో జూనియర్ బాలబాలికల జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి రాష్ట్రపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2004 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీల బరువు ఉండాలని తెలిపారు. ఆధార్ ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. పోటీల ఆర్గనైజర్లు విఠల్‌రెడ్డి, అఖిల్‌కు ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

సీఎంఆర్ లక్ష్యం త్వరగా పూర్తి చేయాలి



వీసీలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: వానాకాలం, యాసంగి 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు కేటాయించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పౌరసరఫరాలశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎంఆర్‌పై మిల్లర్లకు కేటాయించిన రోజువారీ లక్ష్యాలను పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. లక్ష్యం చేరేదాకా సంబంధిత మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్ ఉన్నారు.

స్టాఫ్‌నర్స్‌ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డైలీవేజ్ స్టాఫ్‌నర్స్‌లు

ఉట్నూర్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేసే డైలీవేజ్ స్టాఫ్‌నర్స్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో స్టాఫ్‌నర్స్‌లు కే సుజాత, ఆడె నవ్‌నీత, గిరిజ, ఉమేశ్వరి, మయూరి విలేకరులతో మాట్లాడారు. ఏడేళ్లుగా పీహెచ్‌సీల్లో రెగ్యులర్ స్టాఫ్‌తో సమానంగా ఆరోగ్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. కోవిడ్ సమయంలోనూ ప్రాణాలను పణంగా పెట్టి ఏజెన్సీ ప్రాంతాల్లో సేవలందించామన్నారు. తమకు వెయిటేజ్ కలపకపోవడంతో చాలా అన్యాయానికి గురయ్యామని పేర్కొన్నారు. చాలాసార్లు మంత్రులు, కలెక్టర్, సంబంధిత అధికారులను కలిసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంజేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు.

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: 2024 నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ప్రజలెవరూ రోడ్లపైకి రాకూడదని పేర్కొన్నారు. వేడుకల్లో డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. పోలీస్‌శాఖ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అర్ధరాత్రి ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. జిల్లా పోలీసులకు ప్రజలు సహకరించి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు.

కాలమ్ కలిసిరాలె!




సాక్షి, ఆదిలాబాద్: భీంపూర్ మండలం బెల్సరిరాంపూర్ గ్రామానికి చెందిన ఈ మహిళ పేరు సిడాం రేష్మ. భర్త పేరు గజానన్. వీరిది వ్యవసాయ ఆధారిత కుటుంబం. శనివారం గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె అధికారులకు తెల్లకాగితంపై దరఖాస్తు రాసి ఇచ్చింది. తమ కుటుంబానికి రేషన్‌కార్డు లేదని, ఇప్పించాలని కోరింది. ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంలో పలువురు రేషన్‌కార్డు కోసం ఇలా తెల్లపేపర్‌పై రాసి ఇస్తుండగా, అధికారులు దాన్ని స్వీకరిస్తున్నారు. తెల్ల కాగితం రాసిచ్చే పరిస్థితి ఒక్క బెల్సరిరాంపూర్‌లోనే కాదు.. జిల్లా అంతటా ఉంది. ఇందుకు ప్రభుత్వం ముద్రించిన దరఖాస్తు ఫాంలో రేషన్‌కార్డుకు సంబంధించిన అంశం లేకపోవడమే..



భీంపూర్ మండలం బెల్సరిరాంపూర్‌లో రేషన్‌కార్డు కోసం అధికారులకు తెల్ల కాగితంపై రాసిన దరఖాస్తు ఇస్తున్న సిడాం రేష్మ

- దరఖాస్తుఫాంలో ఐదుగ్యారంటీలే
- పొందుపరచని రేషన్‌కార్డు అంశం
- అయోమయంలో దరఖాస్తుదారులు
- తెల్ల కాగితంపైనే రాసిస్తున్న వైనం
- మూడోరోజుకు చేరిన ప్రజాపాలన



రేష్మ రాసిన దరఖాస్తు

తెల్లకాగితమే దరఖాస్తు ఫాంగా..
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. ప్రభుత్వం రూపొందించిన దరఖాస్తు ఫాంలో ప్రధానంగా కుటుంబ వివరాలతో పాటు రేషన్ కార్డు నంబర్ అడిగారు. అభయహస్తం గ్యారంటీ పథకాలకు సంబంధించి దరఖాస్తు ఫాంలో యువ వికాసం మినహాయించి మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత స్కీంల కోసం మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు వివరాలు అడిగారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలో మూడోరోజుకు చేరిన ఈ కార్యక్రమానికి ప్రజాస్పందన బాగానే ఉంది. కాగా, కొత్త రేషన్‌కార్డులు కావాలనుకునేవారు దరఖాస్తు ఫాంలో ఇందుకు సంబంధించిన అంశం లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. అయినప్పటికీ రేషన్‌కార్డులు లేని వారంతా తెల్ల కాగితం మీదే దరఖాస్తు రాసిస్తున్నారు. మొదటిరోజు నుంచి ఇదే పరిస్థితి ఉంది. దీంతో అధికారులు గ్యారంటీ స్కీంలు కాకుండా ఇతర దరఖాస్తుల కింద జనాలు రాసిచ్చిన అర్జీలు స్వీకరించి లెక్కగడుతున్నారు.

వేలాదిగా దరఖాస్తులు
ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జనవరి 6వరకు కార్యక్రమం కొనసాగనుంది. జిల్లాలో జైనథ్ మండలం జామినిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. మూడురోజుల్లోనే ఐదు గ్యారంటీల ద్వారా లబ్ధి పొందేందుకు వేలాది దరఖాస్తులు వచ్చాయి. రేషన్‌కార్డు కోసం ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు కూడా వేలల్లోనే ఉన్నాయి. ఇచ్చోడలో 735, తలమడుగులో 383, భీంపూర్‌లో 308, బజార్‌హత్నూర్ 304, ఇతర మండలాల్లోనూ అధికసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. కాగా, గ్యారంటీ స్కీంలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు ఏరోజుకారోజు ఆన్‌లైన్ చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..
జిల్లాలోని 17 మండలాలుండగా 468 గ్రామపంచాయతీలున్నాయి. ఇప్పటివరకు 226 పంచాయతీల్లోనే ప్రజాపాలన సభలు నిర్వహించారు. ఐదు గ్యారంటీల కోసం 33,218 మంది, ఇతర పథకాల కోసం 3,096 మంది దరఖాస్తులు అందజేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డుల్లో మొదటి రోజు నుంచి అన్ని వార్డుల్లో కార్యక్రమం కొనసాగుతోంది. ఐదు గ్యారంటీల కోసం ఇప్పటివరకు పట్టణంలో 27,575 దరఖాస్తులు రాగా, ఇతర స్కీంల కోసం 129 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తు ఫాం రూపొందించలే..

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రేషన్‌కార్డుల జారీ కోసం ప్రభుత్వం ఇంకా ఎలాంటి దరఖాస్తు ఫాంను రూపొందించలేదని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోషల్ మీడియాలో దరఖాస్తు ఫాంపై వస్తున్న దుష్ప్రచారం, అపోహలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని సాయినగర్, కేఆర్కే కాలనీ, కొత్త కుమ్మరివాడ కాలనీల్లోని దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాల్లోని అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తులను అక్రమంగా విక్రయించే జిరాక్స్, మీ సేవ కేంద్రాల నిర్వాహకులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని మూడు జిరాక్స్ కేంద్రాలు సీజ్ చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. గ్రామ, వార్డు సభల్లో ముందస్తుగానే ప్రజలకు అవసరమైన దరఖాస్తు ఫాంలు ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలెవరూ జిరాక్స్, మీసేవ కేంద్రాల్లో వాటిని కొనుగోలు చేయవద్దని సూచించారు. గ్యారంటీల అమలుకు షెడ్యూల్ ప్రకారం సభలు నిర్వహిస్తూ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ శైలజ, వార్డు ప్రత్యేకాధికారులు సునీతాకుమారి, రాజలింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు ఫాంలు విక్రయిస్తే చర్యలు

కైలాస్‌నగర్: అభయహస్తం ఆరుగ్యారంటీల దరఖాస్తు ఫాంలు అక్రమంగా విక్రయించే మీ సేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎ.శైలజ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు జిరాక్స్ సెంటర్లను బల్దియా అధికారులతో కలిసి తనిఖీ చేశారు. దరఖాస్తు ఫాంను రూ.30కి అమ్ముతున్నారని ఓ మహిళ సేవదాస్ విద్యామందిర్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కాంప్లెక్స్ కింద గల జిరాక్స్ సెంటర్లలో దరఖాస్తులను అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో వాటిని తనిఖీ చేసి నిర్వాహకులను హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

అవార్డుల ప్రదానోత్సవానికి అతిథిగా సుకుమార్

ఆదిలాబాద్‌రూరల్: సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జనవరి 7న మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్వహించనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి అతిథిగా రావాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులేకు ఆహ్వానం అందింది. నాగపూర్‌కు చెందిన మహాత్మా పూలే సామాజిక శిక్షణ సంస్థ నిర్వహించే కార్యక్రమంలో వివిధ రంగాల్లో కృషి చేస్తున్న 35 మంది ప్రముఖులను సన్మానించనున్నారు. 23 ఏళ్లుగా పూలే జీవిత చరిత్రపై అధ్యయనం చేసి అనేక పుస్తకాలు రాసిన ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త సుకుమార్ పేట్కులేను కార్యక్రమానికి ఆహ్వానించారు. కాగా, ఈనెల 5న పూలే దంపతుల జీవిత చరిత్ర ఘట్టాలపై నిర్మించిన 'సత్యశోధక్' సినిమా నాగపూర్‌లో విడుదల కానున్న సందర్భంగా అక్కడికి బయలుదేరి వెళ్లనున్నట్లు సుకుమార్ పేట్కులే తెలిపారు. విడుదలైన మొదటిరోజే సినిమా తిలకించి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని తిరిగి రానున్నట్లు పేర్కొన్నారు.

12న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

ఆదిలాబాద్: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన జిల్లాస్థాయి యువజనోత్సవాలను నిర్వహించనున్నట్లు డీవైఎస్వో వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ పురస్కారాలు పొందిన జిల్లాకు చెందిన 15–29 ఏళ్ల యువతను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440843848 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకుని డబ్బు, సమయం ఆదా చేసుకోవాలని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ సూచించారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. పలువురు కక్షిదారులు రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోగా వారికి జడ్జి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 10 కోర్టుల్లో 9వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, న్యాయమూర్తులు ఆరుగురే ఉన్నారని పేర్కొన్నారు. దీంతో లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కోర్టు తీర్పులకు పైకోర్టులకు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉంటుందని, లోక్‌అదాలత్‌తో పరిష్కారమైన కేసుల్లో అలాంటి అవకాశముండదని పేర్కొన్నారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటారని, వాటికి తాము చట్టబద్ధత కల్పించి తీర్పు ఇస్తామని తెలిపారు. కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరగకుండా లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, న్యాయమూర్తులు ప్రమీలాజైన్, తులసి దుర్గారాణి, మంజుల సూర్యవార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్, డీఎస్పీ ఉమేందర్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

- జిల్లా విద్యాధికారి ప్రణీత



విద్యార్థిని చదివిస్తున్న డీఈవో ప్రణీత

తలమడుగు: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని జిల్లా విద్యాధికారి ప్రణీత సూచించారు. శనివారం మండలంలోని దేవపూర్ జెడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, హాజరు శాతంపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారితో పాఠాలు చదివించి సామర్థ్యాలను పరీక్షించారు. చదువుతోనే భవిష్యత్ ఉంటుందని, కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఎంఈవో నారాయణ, ఉపాధ్యాయులున్నారు.

నాగోబాను దర్శించుకున్న నోడల్ అధికారి




ప్రశాంతిని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాపాలన ప్రత్యేక నోడల్ అధికారి ఎం.ప్రశాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించి నాగోబా ప్రతిమ అందించారు. సర్పంచ్ మెస్రం రేణుక, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, పూజారి మెస్రం శేకు, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్, మెస్రం వంశీయుడు మెస్రం నాగ్‌నాథ్ తదితరులున్నారు.

జిల్లాకు 'జాతీయ' గుర్తింపు

- విజయవంతంగా దశాబ్ది వేడుకలు
- సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ
- ప్రజావాణిలో మార్పులకు శ్రీకారం
- ప్రజాపాలన దిశగా ముందడుగు
- సుపరిపాలనలో అధికారుల ముద్ర



కేంద్ర మంత్రి గజేందర్ షెకావత్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

రివైండ్ 2023

కైలాస్‌నగర్: 2023లో జిల్లాలో పాలనాపరంగా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. జిల్లాను ప్రగతి పథంలో నడిపించడంతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజల దరికి చేర్చాల్సిన పలువురు జిల్లా ఉన్నతాధికారులు కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. పాలనలో తమదైన ముద్ర వేసే దిశగా ముందుకు సాగారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను పండుగ వాతావరణంలో విజయవంతంగా నిర్వహించారు. భారీ వర్షాలతో పలు గ్రామాల్లో జనజీవనం స్తంభించిపోగా సకాలంలో స్పందించి ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలను అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా నిర్వహించారు. ఈ ఏడాది అధికారుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కింది. నీటి సంరక్షణ విభాగంలో జిల్లాకు జాతీయ స్థాయిలో అవార్డు వచ్చింది.

పాలనలో ప్రత్యేక ముద్ర

- కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రజావాణిపై ప్రత్యేక శ్రద్ధ చూపి మార్పులు తీసుకువచ్చారు. దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రజావాణికి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేయించారు. అధికారులను ఆదేశిస్తూ ఎప్పటికప్పుడు బాధితులకు భరోసా కల్పించారు.
- గత ప్రభుత్వం జూన్ 2నుంచి 22వ తేదీ వరకు తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను జిల్లాలో పండుగ శోభ ఉట్టిపడేలా విజయవంతంగా నిర్వహించారు.
- ఈ ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు పెన్‌గంగానది ఉప్పొంగి ప్రవహించడంతో దాని పరీవాహక ప్రాంతాల్లోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వందలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అయితే జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేసి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చొరవ చూపారు.
- ఈ ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను అధికారులు సమన్వయంతో సమష్టిగా పనిచేసి విజయవంతంగా నిర్వహించారు. ఎన్నికల నుంచి ఫలితాల వరకు మండల, డివిజన్ స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశారు.
- ఇటీవల కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు ఆరు గ్యారంటీలతో ప్రజాపాలనకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోంది.
- జాతీయ స్థాయిలో ఆదిలాబాద్ జిల్లా ఈ ఏడాది అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. నీటి వనరుల సంరక్షణ, నిర్వహణ విభాగంలో భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ప్రకటించిన జాతీయ నీటి అవార్డుల్లో ఆదిలాబాద్ జిల్లా జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్ సాధించింది. కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేందర్ షెకావత్ చేతుల మీదుగా కలెక్టర్ రాహుల్‌రాజ్ అవార్డు అందుకున్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష వద్దు

- డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాథోడ్ నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపవద్దని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్‌ఐవీ లింక్ వర్కర్లతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో దాదాపు 4వేల మంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నారని, ఇందులో 150మంది వరకు చికిత్స పొందడం లేదని తెలిపారు. వ్యాధిగ్రస్తులను సంప్రదించి మందులు వాడితే జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా వారికి లబ్ధి జరిగేలా చూడాలని పేర్కొన్నారు. బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి గజానన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన తదితరులున్నారు.

బయోవ్యర్థాల నిర్వహణ చేపట్టాలి
బయోవ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ సూచించారు. రిమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో బయోవ్యర్థాల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. బయోవ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని, మున్సిపల్ చెత్తలో వేయకూడదని సూచించారు. టీబీ ఆస్పత్రి శుభ్రతపై జనవరిలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి: కెరమెరి మండలంలోని బారె మోడి గ్రామానికి చెందిన మొహర్లే బడిరాం ఇంటి ఆ వరణలో ఈ నెల 29న తనిఖీలు నిర్వహించి రూ.10వేల విలువైన 1.320 కిలోల పచ్చి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ని ర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో కెరమెరి ఎస్సై విజేయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఈజ్‌గాం రోడ్డు (ఆర్‌ఆర్‌ఓ కాలనీ) వద్ద గల పెట్రోల్ పంపు సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... పట్టణ సీఐ బుద్దే స్వామి, ఎస్సై ఎంబడి శ్రీకాంత్‌లు పెట్రోలింగ్‌లో భాగంగా ఆర్‌ఆర్‌ఓ కాలనీ వైపు వస్తుండగా ద్విచక్ర వాహనంపై కూర్చొని ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా ఓ ప్యాకెట్‌లో 40 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన యువకుడు కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం బెంగాలీ క్యాంపు–3కు చెందిన మిథున్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ధాన్యం కుప్ప దగ్ధం



దగ్ధమైన ధాన్యం కుప్ప

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన రైతు ఎస్. సంతరాంకు చెందిన ధాన్యం కుప్ప విద్యుత్ ప్రమాదంలో శనివారం దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఎకరం పొలంలోని ధాన్యం కుప్పగా పోశాడు. ఈ క్రమంలో వరి గడ్డి సమీపంలోని విద్యుత్ తీగల పై పడడంతో మంటలు చెలరేగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ధా న్యంతో పాటు గడ్డి పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో సంతరాం చేతికి స్వల్ప గా యాలయ్యాయి. కేశార్ డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రూ. 50వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని సదరు రైతు వేడుకుంటున్నాడు.

యువకుడి మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సంపత్ (25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.... ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సంపత్ ఈ నెల 26వ తేదీన రాత్రి అదే గ్రామంలోని కిరాణ షాపుకు కోడిగుడ్లు కొనేందుకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వీరబోయిన సతీశ్, పంది మహేశ్, అలుగునూరి అరుణ్ అనే వ్యక్తులు షాపు వద్దే ఉన్నారు. వాళ్లు సంపత్‌తో మాట్లాడుతుండగా సతీష్ సంపత్‌ను అవురా అని అన్నాడు. కులం తక్కువ వాడివి అలా అంటావా అని సతీష్, మహేష్, అరుణ్ సంపత్‌ను కడుపుపై గుద్దారు. దీంతో ఇంటికి వెళ్లిన సంపత్‌కు నొప్పి ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే మళ్లీ సంపత్‌కు శుక్రవారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో చెన్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నతుట్ల సీఐ వివరించారు.

దివ్యాంగుల 'వికాసం'

ఉట్నూర్‌రూరల్: సమాజంలోని ప్రతీఒక్కరిలో ఏదో ఒక సమాజ సేవ చేయాలనే ఆతృత ఇమిడి ఉంటుంది. సమాజ సేవ చేయడానికి ఒక్కొక్కరూ ఒక్కో విధంగా రాణిస్తుంటారు.. అదే మార్గంలో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సైతం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన దివ్యాంగ విద్యార్థులకు విద్యను అందించాలనే ఉద్దేశంతో ఓ పాఠశాలను ఏర్పాటు చేశాడు. భోజనం, వసతి, విద్యను అందిస్తున్నారు. ఆ విద్యా సంస్థ పేరే.. వికాసం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఈ పాఠశాలలో పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా దివ్యాంగ విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు.

- ప్రత్యేక సదుపాయాలతో వసతి
- చదువుల్లో రాణించేలా బోధన
- క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న వైనం
- అంధ విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు



ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని వికాసం పాఠశాల

పీవో కర్ణన్ ప్రత్యేక చొరవ...

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో అప్పటి ఐటీడీఏ పీవో ఆర్వీ కర్ణన్ ప్రత్యేక చొరవతో దివ్యాంగుల కోసం వికాసం పాఠశాలను ఏర్పాటు చేయించాడు. నాలుగు రకాల వైకల్యాలు కలిగిన మొత్తం 142మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఈ పాఠశాలను 2015 నవంబర్‌లో హైకోర్టు జడ్జి దిలీప్ జీ బోస్లే చేతుల మీదుగా ప్రారంభించారు.

వైకల్యం గల వారికి ఆశ్రయం..

వికాసం ప్రత్యేక బాలల బడిలో 1 నుంచి 8వ తరగతి వరకు చదువుకుంటున్నారు. ఇందులో బుద్ధి మాంద్యం గల విద్యార్థులు 37మంది. బధిరులు (చెవిటి, మూగ) 61, అంధులు 29, అంగవైకల్యం కలిగిన వారు 15 మంది ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు.

పాఠశాల ప్రత్యేకత...

ఈ వికాసం పాఠశాలలో దివ్యాంగుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆర్వీ కర్ణన్ ప్రత్యేక బాలల బడిని ఏర్పాటు చేయించారు. ఈ పాఠశాలలో ప్రత్యేకంగా దివ్యాంగులైన పిల్లల కోసం హాస్టల్ వసతి, ప్రత్యేకమైన ఉపాధ్యాయులతో బోధన, మంచి భోజనం, మినరల్ వాటర్, స్నాక్స్ అందిస్తున్నారు. పిల్లలకు ప్రతి నెల డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. పాఠశాలలో పిల్లల కోసం ఆట స్థలం, ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. ఈ పాఠశాలలో మొదట 1వ తరగతి నుంచి 5 వరకు నిర్వహించారు. ప్రతీ ఏడాది ఓ తరగతిని పెంచుతూ ప్రస్తుతం 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో అంధుల కోసం ప్రత్యేక డార్మెంటరీని ఏర్పాటు చేశారు. దీంతో అంధ విద్యార్థులు వారి పనులు వారే చేసుకుంటారు. అంధులు స్మార్ట్ కేన్ సాయంతో టాయిలెట్స్‌కి, తరగతి గదుల్లోకి వెళ్తుంటారు. వీరికి ప్రత్యేకంగా ర్యాంపులు సైతం ఏర్పాటు చేశారు.



దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడల్లోనూ ప్రతిభ...

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని మైదానంలో జరిగిన ఆటల పోటీల్లో రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారెం, జావిలింగ్‌త్రో పోటీల్లో అంధులు, మానసిక వికలాంగ విద్యార్థులు పాల్గొని 18 బహుమతులు గెలుపొందారు. 27న 6వ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ఆరుగురు విద్యార్థులు సత్తాచాటి బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. అలాగే సైన్స్‌పేర్ పోటీల్లో సైతం జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు.



క్రీడల్లో రాణించిన వారిని అభినందిస్తున్న పీవో

ఇక్కడ చదువుకోవడం ఇష్టం..



వికాసం పాఠశాలలో ఉండి చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్న. ఇక్కడ చదువుకోవాలంటే చాలా ఇష్టం.. సార్లు బాగ చూసుకోవడంతో పాటు తమకు అర్థమయ్యే రీతిలో మమ్మల్ని చదివిపిస్తున్నారు. అంతేకాకుండా తమ పనులు తాము చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎవరి తోడు లేకున్నా మా పనులు మేము చేసుకుంటాం.

– టి.హన్మంతు, 7వ తరగతి, అంధ విద్యార్థి సిర్పూర్(యు)

ఇంటికి కూడా వెళ్లం..



ఇంటి కంటే ఇక్కడే మంచిగా అనిపిస్తది. అందరితో కలిసి చదువుకోవడం అన్ని పనులు చేసుకోవడం బాగుంటుంది. సార్లు తమకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించడం, మంచి భోజనం అందించడం, ఆటలు, పాటలు నేర్పించడం సంతోషాన్ని కలిగిస్తుంది. నేను కూడా బాగా చదువుకొని మంచి స్థాయికి ఎదుగుతా..

– బి.రంజిత్, 8వ తరగతి, ఉట్నూర్ కొత్తగూడ

పిల్లలు ఇష్టంగా నేర్చుకుంటున్నారు..



పాఠశాలలో ఉన్న విద్యార్థులంతా అంగ వైక్యలం కలిగిన వారే. వారికి చదువంటే చాలా ఇష్టం.. తాము సైగల ద్వారా వారికి విద్యాబోధన చేస్తాం.. మొదట్లో కాస్త కష్టమైన వారికి అర్థమయ్యే రీతిలో విద్యను అందిస్తుండడంతో వారు ఇష్టంగా చదువుకుంటున్నారు. ఆటపాటలు నేర్చుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వీరికి విద్యను అందించడం అదృష్టంగా భావిస్తున్న.

– పావని, ఉపాధ్యాయురాలు

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



దివ్యాంగ విద్యార్థులు కావడంతో వారికి అన్నివసతులు, భోజన సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందిస్తున్నాం. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పాఠశాల గురించి తెలుసుకున్న వారు ఇతర జిల్లాల నుంచి కూడా దివ్యాంగ విద్యార్థులను ఇక్కడ చేర్పిస్తున్నారు. చదువుతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ రాణిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయింది.

– రాథోడ్ వికాస్, వికాసం పాఠశాల, ప్రధానోపాధ్యాయుడు

ఖానాపూర్‌లో పట్టపగలు చోరీ



టవర్స్‌కాలనీలో క్లూటీం విచారణ

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలోని టవర్స్‌కాలనీలోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన వ్యాపారి చిటికేశి ఆశిష్ కుటుంబీకులు ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చే చూడగా ఇంట్లోని 14తులాల బంగారంతో పాటు రూ.40వేల నగదునుఎత్తుకెళ్లారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన గోలి ప్రతాప్ నివాసంలో 10 గ్రాముల వెండిని ఎత్తుకెళ్లారు. రాజీవ్‌నగర్ కాలనీలోని రాజేశ్వర్‌గౌడ్, ప్రకాష్‌ల నివాసాల్లో సైతం ఓ దొంగ ముసుగు వేసుకుని ఇళ్లల్లో చొరబడి చోరీకి యత్నించాడు. ఆయా నివాసాల్లో ఎలాంటి నగదు, బంగారం దొరకకపోవడంతో వెళ్లిపోయాడు. రాజీవ్‌నగర్ కాలనీలోని సీసీ పుటేజీలో ఒక నిందితుడికి సంబంధించిన చిత్రాల్ని పోలీసులు గుర్తించి విచారణ చేపట్టారు. ఈమేరకు సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో క్లూటీంలతో కలిసి అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

ఎడ్లబండిపై జంగుబాయి దర్శనానికి..



ఎడ్లబండిపై వెళ్తున్న ఆదివాసీ గిరిజనులు

నార్నూర్: ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం జంగుబాయి దర్శనానికి శనివారం మండలంలోని గుంజాల గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు ఎడ్ల బండ్లపై బయలుదేరారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజాసామగ్రితో దాదాపు మహారాష్ట్ర సరిహద్దులోని జంగుబాయి పుణ్య క్షేత్రానికి కొందరు కాలినడకన వెళ్లారు. పుష్య మాసం ప్రారంభానికి ముందు ఏటా ఇక్కడ మొక్కులు తీర్చుకుంటామని గ్రామ పటేల్ తెలిపారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం

నర్సాపూర్(జి): మండల కేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రకృతి ఒడిలో వెలిసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి (ఆది దంపతుల) కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వస్తి పుణ్యాహవాచనం, మూలవిరాట్ అభిషేకం, స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రధాన వీధుల గుండా ఊరేగించి ఆలయానికి తీసుకువెళ్లారు. అనంతరం పురోహితులు నరహరి శర్మ, రాజశేఖర్ శర్మ, జంగం గంగాప్రసాద్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. నర్సాపూర్ (జి) కి చెందిన గుజరాతి సోనియా–కిరణ్ బాబు దంపతులు స్వామి కల్యాణంతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

ఆది దంపతుల విగ్రహాలు

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఇంద్రవెల్లి: చేపల వేటకు వెళ్లి ఇంద్రవెల్లి మండలంలోని కొబ్బయ్‌గూడ గ్రామ సమీపంలోని చెరువులో ఈ నెల 26న గల్లంతైన వ్యక్తి గారుశే నాందేవ్(30) మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు. నాలుగు రోజులుగా గజఈతగాళ్ల సాయంతో గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. శనివారం ఉదయం చెరువులో నాందేవ్ మృతదేహం తేలి కనిపించింది. మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చేపలవేటకు తన భర్తను తీసుకెళ్లిన రమేష్, మారుతి, డిగంబర్‌లపై అనుమానం ఉందని, దర్యాప్తు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సుమన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందడంతో అంజీ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. భార్య సుమన్‌బాయితో పాటు కూతురు ఉన్నట్లు తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై సునీల్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఇమ్రాన్‌ఖాన్ (ఫైల్)

కుంటాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. బంధువుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ఇమ్రాన్‌ఖాన్ (25) మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన వరుసకు మేనమామ అయిన ఖదీర్ వద్దే ఉంటూ చదువుకున్నాడు. ఇటీవల కుంటాలలో వెల్డింగ్ దుకాణం నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం మిత్రుడు వంశీతో కలిసి సారంగాపూర్ మండలం మలక్ చించోలిలోని విందు కార్యక్రమానికి వెళ్లాడు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఇమ్రాన్‌ఖాన్ తీవ్రంగా గాయపడగా వంశీకి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిర్మల్‌కు తరలించారు. ఇమ్రాన్‌ఖాన్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. కుటుంబీకులు సారంగపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అడిషనల్ డీఎంహెచ్‌వోకు సన్మానం



గజానన్‌ను సన్మానిస్తున్న సంఘ బాధ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అడిషనల్ డీఎంహెచ్‌వోగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన గజానన్‌ను తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సంఘం బాధ్యులు పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, అల్లాడి రఘురామారావు, బాధ్యులు మహేందర్, బ్రహ్మానందరెడ్డి, సిడాం వామన్‌రావు, రమణాచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా హామీ నెరవేర్చే తరుణం కోసం...

- వేచిచూస్తున్న గల్ఫ్ మృతుడి కుటుంబం
- భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీకి వినతి..
- ప్రజాపాలన కార్యక్రమంలో మరోమారు దరఖాస్తు



దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన మూడ లక్ష్మి



జోడోయాత్రలో రాహుల్‌ను కలిసిన లక్ష్మి

నిర్మల్‌ఖిల్లా: ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు మూడ లక్ష్మి. నిర్మల్‌రూరల్ మండలంలోని కొట్ట–కే గ్రామం. గల్ఫ్ కార్మికుడైన భర్తను పోగొట్టుకుంది. శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు అందించింది. గతేడాది నవంబర్ 6న కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా హైదరాబాద్ సమీపంలోని బాచుపల్లిలో తన పదినెలల పసిపాప సాత్వికతో కలిసి తన గోడును విన్నవించుకుంది. ఆ పసిపాపది మాట్లాడే వయసు కూడా కాదు. గల్ఫ్ మృతుడి భార్య దీనస్థితిని చూసి చలించిన రాహుల్ గాంధీ తనతో పాటు యాత్రలోని కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆ కుటుంబానికి సాయం అందేలా చూడాలని సూచించారు. నిర్మల్ జిల్లాలోని కొట్ట–కే గ్రామానికి చెందిన మూడ అశోక్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన అబుదాబి వెళ్లాడు. అక్కడ అనుకోని ఘటనలో మృతి చెందాడు. అయితే అతడికి అప్పటికే భార్య మూడ లక్ష్మితో పాటు ఆరేళ్లలోపు ఇద్దరు పిల్లలు, పది నెలల పసిపాప సాత్విక ఉంది. ఈ చిన్నారికి పుట్టుకతోనే అనారోగ్య సమస్య ఉండడంతో రాహుల్‌గాంధీని కలిసిన అనంతరం నాలుగు నెలలకే మృత్యుఒడికి చేరుకుంది.

సంవత్సరం దాటిపోతోంది.

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొలువుతీరింది. అనంతరం ఆరు గ్యారెంటీల అమలు నిమిత్తం ప్రస్తుతం ప్రజాపాలన కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం గల్ఫ్ మృతుల కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని వేడుకుంటోంది. తన భర్త అశోక్ గతేడాది జూలై 24న అబుదాబి దేశంలో మరణించడంతో తన కుటుంబ జీవనం కష్టతరంగా మారిందని వాపోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, తదితర నాయకుల హామీ మేరకు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవిస్తోంది. ఇదే అంశంపై శుక్రవారం నిర్మల్ రూరల్ మండలంలోని కొట్ల(కె) గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు సమర్పించింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గుడిహత్నూర్: కుటుంబ కలహాలతో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... జాయ్‌బాయే వెంకటి (51) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. కొన్నిరోజులుగా కుటుంబ కలహాలతో సరిగా వ్యవహరించడం లేదు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై ఇమ్రాన్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య, కొడుకు ఉండగా కూతురు వివాహమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఉపాధ్యాయుల డుమ్మాపై విచారణ



విచారణ చేపడుతున్న ఎంఈవో చంద్రకాంత్



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎలాంటి సమాచారం లేకుండా శుక్రవారం గైర్హాజరయ్యారు. దీంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో చంద్రకాంత్ శనివారం పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం సురేశ్ రావు, సర్పంచ్ ముత్తగౌడ్, వీడీసీ సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టారు. సమాచారం లేకుండా గైర్హాజరైన ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేసి తమ పాఠశాలకు కొత్త ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు ఎంఈవోను కోరారు. ఈమేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఎంఈవో హామీ ఇచ్చారు. విచారణలో వీడీసీ చైర్మన్ నర్సారెడ్డి, విద్యా కమిటీ సభ్యులు సాయిప్రసాద్, అలీం, జావిద్, ముజాహిన్, గంగాధర్ ఉన్నారు.

నిర్మల్‌లో... కందకాలు కబ్జా



సాగర్‌కాలనీలో వర్షాకాలంలో వర్షపు నీటితో కందకం



మట్టివేసి కబ్జా చేస్తున్న దృశ్యం



ప్రియదర్శినగర్‌లోనీ రోడ్ నంబర్ వన్‌లో..

నిర్మల్ అంటేనే కబ్జాలకు కేరాఫ్.. అనే చందంగా రాష్ట్రస్థాయిలో చర్చ సాగుతోంది. నిండుకుండల్లాంటి చెరువులను చెరబట్టేందుకే తెగించారు. ఇక కందకాలు ముచ్చట చెప్పనక్కరలేదు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఆక్రమణలు చేస్తున్నారంటే ఎవరు పెద్దగా పట్టించుకోరు. కానీ నిర్మల్‌లో మాత్రం కళ్లముందే, పట్టపగలే యథేచ్ఛగా కబ్జాచేస్తున్నారు. జనావాసాల మధ్య ఉన్న కందకాలను మాయం చేస్తున్నారు. అధికారులు మాత్రం స్పందించడం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో నిర్మల్ చెరువులా మారుతోంది.

– సాక్షి ఫొటో గ్రాఫర్ నిర్మల్